క్లుప్తంగా

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కరప: ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కర్రె స్వప్న ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 20వ తేదీన గురజనాపల్లిలో, 21న పెద్దాపురప్పాడులో, 27న యండమూరులో, 28న కరపలో, 29న కొంగోడు గ్రామాల్ల ఆధార్ సేవలందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, నమోదు పూర్తయినా ఆధార్‌కార్డు రానివారు, బయోమెట్రిక్ అప్‌డేషన్, ఆధార్ మొబైల్ లింక్ అప్‌డేషన్, 2010-16 ఏళ్ల మధ్యకాలంలో ఆధార్‌కార్డు తీసుకుని అప్‌డేట్ చేయించుకోని వారు ఆయా గ్రామాల్లో సచివాలయాలకు వెళ్లాలన్నారు. ఇతర ఆధార్ సంబంధ సేవలు అందించేందుకు ఏర్పాటుచేసిన ఆధార్ సేవలను గ్రామస్తులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ స్వప్న సూచించారు. ఏఓ గుత్తుల భీమశంకర రావు పాల్గొన్నారు.

కుట్టుమెషీన్, ట్రైసైకిల్ అందజేత



కుట్టు మెషీన్ అందిస్తున్న డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు

బోట్‌క్లబ్: విడోస్ హోం వ్యవస్థాపకుడు పైడా రామకృష్ణయ్య వర్ధంతి సందర్భంగా నిరుపేదలకు కుట్టుమిషన్లు, ట్రైసైకిళ్లు అందజేశారు. స్థానిక సాంబమూర్తినగర్ వికలాంగ పాఠశాల్లో శనివారం దేవదాయశాఖ డీసీ కార్యాలయ సూపరిండెంటెంట్ నాగేశ్వరరావు వీటిని అందజేశారు. అనంతరం దివ్యాంగుల పాఠశాలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. విడోస్ హోం చైర్మన్ పైడా రామకృష్ణారావు, దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, డీసీ కార్యలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



నేమాం-4 లే అవుట్‌లో అధికారులతో కురసాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: మండలంలో గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ అధికారులను కోరారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం మండలంలోని నేమాం-4 లే అవుట్‌ను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. గృహ నిర్మాణాల వివరాలను డీఎల్‌డీఓ నారాయణమూర్తి ఆయనకు వివరించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ నాగభూషణం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీదేవి, ఏఈ మారుతిరామ్, డీటి శ్రీ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

30న సీతారామ కల్యాణోత్సవం

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారామ కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ బిక్కిన వెంకటరాయ చౌదరి తెలిపారు. శనివారం ఆలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 12 వరకూ కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. అలాగే ఏప్రిల్ ఒకటిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం జరుగుతుందన్నారు. 6న శేష హోమం, పూర్ణాహుతి, చక్రతీర్థోత్సవం, 7న శ్రీపుష్పయాగోత్సవం, 12న సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం జరుగుతాయన్నారు.

బాలాత్రిపుర సుందరి ఆలయ హుండీల లెక్కింపు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి హుండీలను శనివారం దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. మూడు నెలల 15 రోజులకు రూ.4.77 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణికుమార్ సమక్షంలో ఈ హుండీలు లెక్కించారు. ఈ కార్యక్రమంలో బాలాత్రిపుర సుందరి సేవా సమితి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమ కార్యాచరణకు సంఘీభావం

కాకినాడ సిటీ: ఉద్యోగుల న్యాయ పరమైన డిమాండ్లపై ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకులు శనివారం కాకినాడ కలెక్టరేట్‌కు వచ్చి వివిధ శాఖల ఉద్యోగులతో చర్చించారు. ఉద్యమ కార్యాచరణకు ప్రతి ఉద్యోగి సంఘీభావం ప్రకటించారు. ఏప్రిల్ 5 వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన కొనసాగించాలని సంఘాల నాయకులు కోరారు. కాకినాడ వచ్చిన జేఏసీ రాష్ట్ర ప్రతినిధులు కలెక్టరేట్‌లో డీఆర్‌వో కె.శ్రీధర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి ఉద్యమ ఆవశ్యకతను వివరించారు. జిల్లా నాయకులు పితాని త్రినాథరావు, దుర్గాప్రసాద్, చిన్న, దుర్గాప్రసాద్, సచివాలయం ఉద్యోగులు, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇలాగైతే తాగునీటికి కటకటే..!

రానున్నది మండు వేసవి. అధికార యంత్రాంగం ఇప్పటికే తాగునీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ ప్రణాళికలు చేపడుతోంది. చెరువులు, కాలువలు, డ్రైన్లలో పూడికతీతలకు ఇప్పటి నుంచే పనులు మొదలుపెట్టారు. అందుకు తగ్గట్టు నిధులూ సమకూర్చుకుంటున్నారు. శివారు గ్రామాలకు సైతం తాగునీరు అందేలా వారి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. రానున్న వేసవి తీవ్రంగా ఉంటుందని ఇప్పటికే వాతావరణ హెచ్చరికలు అందుతున్నాయి. మరి క్షేత్రస్థాయిలో అందుకు తగ్గట్టు సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారా అంటే.. ఇదిగో ఈ రహదారులపై నీరే సమాధానం. ఇది వాననీరు కాదు. పైప్‌లైన్ల లీకేజీలు. ఒకవైపు తాగునీటి కొరత.. మరో వైపు తాగునీటి కాలుష్యానికి కారణమయ్యే లీకేజీలను చూసీ చూడనట్టు వదిలేయకుండా సత్వర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అన్నింటినీ ఉన్నత అధికారులను బాధ్యులను చేయకుండా క్షేత్రస్థాయి యంత్రాంగం కూడా అప్రమత్తంగా వ్యవహరించి సమస్య పరిష్కారానికి చొరవ చూపే తరుణం ఇది.

కరప: ఈ చిత్రం చూసి సిమెంట్‌రోడ్డుపై వాననీరు నిలబడిందనుకుంటున్నారా? కాదండీ పైపులైన్ నుంచి వృథాపోతున్న నీరిది. కరపలోని కొత్తపేట వీధిలో చాలా రోజులుగా ఇదే పరిస్థితి. కరప సమీపంలోని పెనుగుదురు నుంచి పైపులైన్ కొత్తపేటవీధి మీదుగా పేపకాయలపాలెంలోని ఓవర్‌హెడ్ ట్యాంకుకు వెళ్లే పైప్‌లైన్‌కు గత ఏడాది కన్నం పడి తాగునీరు వృథా పోతూ బురదగా మారుతోంది. నీటి సరఫరా లేని సమయంలో ఈ బురదనీరే మళ్లీ పీడనం కారణంగా పైప్‌లైన్‌లోకి ప్రవేశించి తాగునీరు కలుషితమవుతోంది. సత్వరం సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బోట్‌క్లబ్: కళ్లెదుటే తాగునీరు వృథా పోతున్నా పట్టించుకొనేవారు లేరు. స్థానిక విద్యుత్‌నగర్ వాటర్ ట్యాంకు ఎదురుగా మూడు రోజులుగా తాగునీరు నేలపాలవుతుంది. ఈ రహదారిలో ఉన్న తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడం వల్ల ఈ పరిస్థితి. కార్పొరేషన్ పైపులైన్ ద్వారా ఉదయం 6 నుంచి 7 గంటలు వరకూ, సాయంత్రం ఐదు నుంచి 6 గంటలు వరకూ తాగునీరు వస్తుంది. రోజుకి రెండు గంటల పాటు ఇలా తాగునీరు పోతోంది. పైపులైన్ పగిలిపోవడంతో మురుగు నీరు పైపులైన్‌లోకి చేరుకుని తాగునీరు కలుషితమవుతోంది వస్తుంది. కార్పొరేషన్ వాటర్ వర్క్స్ అధికారులు వెంటనే స్పందించి పైపులైన్‌కు మరమత్తులు చేయాలని ఈ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు.



కరప కొత్తపేటవీధిలో వృథా పోతున్న తాగునీరు



పైపులైన్ పగిలిపోవడంతో విద్యుత్‌నగర్‌లో రోడ్డుపైనే తాగునీరు

పరిశోధనలతో దేశ ప్రతిష్ట పెంచాలి



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు, డీఈ బాలకృష్ణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్

- జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు
- టెక్‌ఫెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని యువ ఇంజినీర్లకు పిలుపు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): శాస్త్ర సాంకేతిక విద్యను అభ్యసించే యువ ఇంజినీర్లు పరిశోధనలు చేసి దేశ ప్రతిష్ట పెంచాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. ముందుగా ఫెస్ట్‌కు సంబంధించి సావనీర్ అవిష్కరించారు. జేఎన్‌టీయూకేలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈఈఈ, ఈసీఈ, మెకానికల్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్ శనివారం ప్రారంభించి మాట్లాడుతూ నూతన అవిష్కరణలు, వినూత్న పరిశోధనలు, స్టార్టప్‌లకు ఇటువంటి టెక్‌ఫెస్ట్‌లు ఎంతో ఉపయోగపడతాయని, టెక్‌ఫెస్ట్‌ల ద్వారా విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు సాంకేతిక విజ్ఞానం మెరుగుపరచుకోవడానికి మంచి వేదికగా నిలుస్తాయన్నారు. జాతీయస్థాయి సింపోజియంలో పాల్గొని మేధో మథనం చేసి జ్ఞానసముపార్జన చేసి ఉన్నతస్థాయికి ఎదగవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ హెచ్ఎం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ టెక్‌ఫెస్ట్‌ల ద్వారా నేర్చుకున్న ఆధునిక సాంకేతికతను తోటి స్నేహితులకు అందించి ఆదర్శంగా నిలవాలన్నారు. సానుకూల దృక్పథంతో విద్యార్థులు ముందుకు సాగి తమ కలలు సాకారం చేసుకోవాలని సూచించారు. టెక్‌ఫెస్ట్‌లో భాగంగా పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ, ఈఈఈ హెడ్ రవీంద్ర, ఈసీఈ హెడ్ బాలాజీ, మెకానికల్ హెడ్ మోహనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేంకటేశునికి జన్మనక్షత్ర పూజలు

కరప: యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వెంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం శ్రవణం నక్షత్రాన్ని పురస్కరించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం, వేద పండితులతో కలసి పూజలు చేశారు. అనంతరం వేంకటేశ్వర వ్రతాలు నిర్వహించారు. యండమూరు, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, వ్రతాలు చేయించుకుని, స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కరప విష్ణాలయంలోని వెంకటేశ్వరస్వామికి అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, కూరాడ, పెనుగుదురు, గురజనాపల్లి, వేళంగి తదితర గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి జన్మనక్షత్ర పూజలు నిర్వహించారు.



యండమూరు వెంకటేశ్వర ఆలయంలో పూజలు, వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

భారత్ గౌరవ్ రైలుకు ఘన స్వాగతం



సామర్లకోట వచ్చిన భారత్ గౌరవ్ టూరిస్టు ఎక్స్‌ప్రెస్ రైలు

సామర్లకోట: వివిధ రాష్ట్రాల్లో ఉన్న ప్రముఖ పుణ్య క్షేత్రాలను దర్శించుకునేలా దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసిన భారత్ గౌరవ్ టూరిస్టు ఎక్స్‌ప్రెస్ రైలుకు శనివారం రాత్రి సామర్లకోటలో స్థానిక రైల్వే అధికారులు ఘన స్వాగతం పలికారు. శనివారం సికింద్రాబాద్‌లో బయలు దేరిన రైలు 22వ తేది వారణాసి చేరుతుంది. పూరి, కాశీ, అయోధ్య యాత్రల కోసం ఈ రైలును ఏర్పాటు చేసినట్లు స్థానిక రైల్వే మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. 14 బోగీలతో యాత్రికుల కోసం రైలులో ఏడు స్లీపర్ కోచ్‌లు, మూడు ఏసీ కోచ్‌లు, ఒక సెకండ్ ఏసీ కోచ్ ఉంటాయని తెలిపారు. యాత్రికులు ఆన్‌లైన్‌లో మాత్రమే టిక్కెట్లు తీసుకోవలసి ఉంటుందన్నారు. సామర్లకోట వచ్చిన రైలుకు రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు సంతోష్ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, ఏడీఈఎన్ శివప్రసాద్, చీఫ్ టిక్కెటు ఇన్‌స్పెక్టరు రామకృష్ణ, ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్.శివరామకృష్ణ, జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు స్వాగతం పలికారు.

అలరించిన సంగీత కచేరీ

కాకినాడ కల్చరల్: స్థానిక సర్పవరంలోని భవానీ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీవాగ్గేయకారుల మండపంలో శనివారం సాయంత్రం సంగీత నీరాజనం పేరుతో ఏర్పాటు చేసిన సంగీత కచేరీ అలరించింది. అన్నమాచార్య వర్ధంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సంగీత కచేరీలో సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి, చావలి సూర్యకుమారి, ప్రభల రాజేశ్వరిల శిష్యులు అన్నమాచార్య కృతులు ఆలపించారు. వీరికి వయోలిన్ విద్వాంసులు మహేంద్రవాడ నరసింహమూర్తి, మృదంగం విద్వాంసులు ఎ.అనిల్‌కుమార్ వాద్య సహకారం అందజేసారు.

నేడు ఉపాధి పనుల ప్రజావేదిక

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉపాధి పనులపై ప్రజా వేదిక నిర్వహించి, బహిరంగ సమీక్ష నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కర్రె స్వప్న తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి నిధులతో వివిధ శాఖల ద్వారా 2021 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2022 మార్చి 31వ తేదీ వరకు చేసిన పనులపై ఈ నెల 5వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సామాజిక తనిఖీ చేసి గ్రామసభలు నిర్వహించినట్టు తెలిపారు. ఆయా తనిఖీలపై బహిరంగ సమీక్ష నిర్వహించేందుకు ప్రజా వేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, ఉపాధి పథకం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె కోరారు. ఉపాధి పథకం ఏపీఓ ఈ.వెంకటరమణ పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మండల పరిధిలోని గురజనాపల్లిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామని, అర్హులుంటే ఈనెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ స్వప్న కోరారు. 23న దరఖాస్తులను పరిశీలించి, 24న సెలక్షన్ కమిటీద్వారా ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. 25న ఎంపికైన అభ్యర్థికి సమాచారం ఇచ్చి, 27న ఎంపికైన అభ్యర్థికి శిక్షణ ఇచ్చి, 28న పోస్టింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు.

డీఈఓకు 98 డీఎస్సీ అభ్యర్థుల అభినందన



డీఈవో అన్నపూర్ణకు అభినందనలు తెలిపిన వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

కాకినాడ సిటీ: డీఎస్సీ 98 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని ప్రత్యేక జీవో విడుదల చేయడంపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపీకృష్ణ, ఉపాధ్యక్షులు కె.వెంకటరమణమూర్తి పలువురు నాయకులతో డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణను కలిసి అభినందనలు తెలిపారు. జీవో ప్రకారం అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుమతితో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకున్న 98 డీఎస్సీ అభ్యర్థులందరికీ ఉద్యోగాలు వచ్చేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 98 డీఎస్సీ అభ్యర్థులు డీఈవో అన్నపూర్ణను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. డీఎస్సీ 98 రాష్ట్ర నాయకులు బండారు శ్రీనివాస్, ఎమ్మెస్ రావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో నాలుగు కేసుల పరిష్కారం



ప్రీ లిటిగేషన్ కేసు వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తులు శ్రీనివాసరావు, గోపాలకృష్ణ

కాకినాడ లీగల్: ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా 4 కేసులు పరిష్కారమయ్యాయని మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం మూడు బెంచ్‌లు ఏర్పాటు చేసి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ నాలుగు కేసులు పరిష్కారమయ్యాయి. బెంచ్‌లకు మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాసరావు, ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి వై.గోపాలకృష్ణ, జూనియర్ సివిల్ జడ్జి కం మెజిస్ట్రేట్ పి.భరద్వాజ్ న్యాయమూర్తులుగా వ్యవహరించారు.

న్యాయ సేవాధికార సంస్థలో..

ప్యారీ సుగర్స్ ఫ్యాక్టరీలో మొదటి ప్రమాదం జరిగినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంతోనే రెండో సారి ప్రమాదం జరిగి నలుగురు కార్మికులు మృతి చెందారని కాకినాడ రూరల్, కొవ్వాడ గ్రామానికి చెందిన రాంబాల సతీష్ ప్రీ లిటిగేషన్ కేసుగా కాకినాడ న్యాయ సేవాధికార సంస్థలో దాఖలు చేశారు. కాకినాడ రూరల్, వాకలపూడిలో ఉన్న ప్యారీ సుగర్స్ రిఫైనరీ ప్రైవేట్ లిమిటెడ్‌లో గత ఏడాది ఆగస్టు 19న ప్రమాదం జరిగి ఇద్దరు కార్మికులు మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే వైపర్ కమిటీ వేసినప్పటికీ ఆ కమిటీ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఆ నిర్యక్ష్యంవల్ల రెండోసారి 2022 ఆగస్టు 29న ప్రమాదం జరిగి నలుగురు మృతి చెందారు. దీంతో మండల న్యాయసేవాధికార సంస్థ సంబంధిత అధికారులకు సమన్లు పంపారు. శనివారం ప్రత్యేక లోక్ అదాలత్‌లో అధికారులు హాజరయ్యారు. లోక్ అదాలత్‌లో జిల్లా అధికారులు, ప్రభుత్వ న్యాయవాది మాట్లాడుతూ కార్మికుల కటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించామని, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. అనంతరం పిటిషన్ వేసిన సతీష్ మాట్లాడుతూ మొదటి సారి జరిగిన తర్వాత కమిటీ సమావేశంలో ఫ్యాక్టరీ అంతా తనిఖీ చేయాలని కోరినా చేయలేదని, దానివల్ల రెండోసారి ప్రమాదం జరిగి నలుగురు కార్మికులు మృతి చెందారని, మృతికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చొల్లంగిలో త్వరలో ఇళ్ల స్థలాల పంపిణీ

- 5106 మందికి అందజేసేందుకు ఏర్పాట్లు
- ఆ వెంటనే గృహ నిర్మాణాల ప్రారంభం
- కార్పొరేషన్ కమిషనర్ రమేష్



చొల్లంగి లే అవుట్‌ను సందర్శించిన కమిషనర్ రమేష్

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద చొల్లంగి గ్రామంలోని 112 ఎకరాల్లో 5106 మంది లబ్ధిదారులకు త్వరలో ఇళ్ల స్థలాలు అప్పగించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. ఆ వెంటనే ఇళ్ల నిర్మాణాలు కూడా చేపడతామన్నారు. హౌసింగ్–డేలో భాగంగా శనివారం ఏడీసీ సీహెచ్ నాగ నరసింహారావు, కార్పొరేషన్, హౌసింగ్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో కమిషనర్ చొల్లంగి లే అవుట్‌ను సందర్శించి పనులను పరిశీలించారు. హద్దులు నిర్ణయించేందుకు రాళ్లు పాతడం, స్థలాన్ని చదును చేయడం, స్థలంలో పేరుకుపోయిన చెత్త తొలగింపు పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు కూడా పంపిణీ చేశామన్నారు. ఏప్రిల్ నాటికి జియో ట్యాగింగ్ పూర్తి చేసి లబ్ధిదారులకు స్థలాలను అప్పగించడంతోపాటు, ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పండూరు లే అవుట్ సందర్శన

కమిషనర్ రమేష్ వివిధ శాఖల అధికారులతో కలిసి పండూరు లే అవుట్‌ను కూడా సందర్శిం ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. 1086 ఇళ్లకు 187 నివాసాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను కూడా వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారులను ప్రోత్సహించాలని సంబంధిత విభాగాలను ఆదేశించారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు ప్రస్తుతం అనువైన సమయమని, నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు ఎదురైనా తమ దష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గృహ నిర్మాణ శాఖ డీఈ సత్యనారాయణ రెడ్డి, టీపీఆర్‌ఓ మానే కృష్ణమోహన్, పలువురు డీఈలు, ఏఈలు ఉన్నారు.

వేణుగోపాలుని ఆలయానికి శంకుస్థాపన

- రూ.50 లక్షలతో నిర్మాణం



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ దంపతులు, కురసాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురంలో ప్రసిద్ధిగాంచిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలుని ఆలయ పునర్నిర్మాణానికి శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఆయన సోదరుడు దంపతులు పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పాల్గొని భూమి పూజ చేశారు. ఆలయ అర్చకులు హోమం, ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గంలోని ఆలయాల పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే కన్నబాబు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని సత్యనారాయణ పేర్కొన్నారు. నియోజకవర్గంలో సుమారు 87 ఆలయాల పనులకు నిధులు మంజూరు చేయించారన్నారు. ఈ ఆలయ నిర్మాణానికి సీజీఎఫ్ నిధులు రూ.50 లక్షలు మంజూరు చేశారన్నారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ మాట్లాడుతూ 250 ఏళ్ల నాటి ఆలయం శిథిలమవడంతో ఎమ్మెల్యేకు పరిస్థితి వివరించగా ఆయన సహకారంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బద్దిలి అచ్చారావు, సభ్యులు, ఈఓ పి.కృష్ణారెడ్డి, వైస్ఎంపీపీ మందిలి విరిషా తదితరులు పాల్గొన్నారు.

మాలల హక్కుల కోసం యుద్ధభేరి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ: మాలల హక్కుల కోసం చేపడుతున్న మాలల మల్ల యుద్ధభేరిని విజయవంతం చేయాలని ఆంధ్రమాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 24న కాకినాడ మెక్లారిన్ పాఠశాల ప్రాంగణంలో ఆంధ్రమాల మహానాడు ఆధ్వర్యంలో మాలల మల్ల యుద్ధభేరిని నిర్వహిస్తున్నట్లు కొండబాబు తెలిపారు. భారత రాజ్యాంగ పరిరక్షణ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, క్రైస్తవ ప్రజల రక్షణ, మహిళల హక్కుల పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని, వాటిని రక్షించడానికి నిరంతరం పోరాడతామన్నారు. ఆ రోజు కాకినాడలో భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. జాతీయ మాల మహానాడు నాయకులు అద్దంకి దయాకర్, లింగం శివప్రసాద్ పాల్గొంటారని కొండబాబు వివరించారు. బిషప్ జోసఫ్ బెన్నీ, శీరం ఐజాక్, లింగం శివప్రసాద్, గుబ్బల ఆదినారాయణమూర్తి, అంబటి వెంకటేశ్వరరావు, బోడపాటి కాంతం తదితరులు పాల్గొన్నారు.

నీరుగారుతున్న కోర్టు పనులు

- ఒక్క వర్షంతో ఎక్కడికక్కడ లీకులు
- రూ.లక్షలు వృథా



బ్యాడ్మింటన్ కోర్టు సీలింగ్ నుంచి పడుతున్న వాన నీరు

నాగమల్లితోట జంక్షన్: జిల్లా క్రీడామైదానంలో ఇటీవల రూ.40 లక్షల ఓఎన్‌జీసీ నిధులతో చేపట్టిన బ్యాడ్మింటన్ కోర్టు ఆధునీకరణ పనుల్లో నాణ్యతా లోపాలు బయటపడ్డాయి. శనివారం కురిసిన చిన్నపాటి వర్షానికే కోర్టు సీలింగ్‌లో లీకులు బయట పడ్డాయి. దీంతో లక్షల రూపాయలతో ఏర్పాటు పనులు నిరుపయోగమయ్యాయి. దీని వల్ల సింథటిక్ మ్యాట్, వుడెన్ ఫ్లోరింగ్ పాడయ్యే పరిస్థితి నెలకొందని కోచ్ చిన్నారి, క్రీడాకారులు వాపోతున్నారు. దీనిపై డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్‌ను వివరణ కోరగా వర్షం పడడంతో పనుల్లో డొల్లనతం బయట పడింది. కాంట్రాక్టర్‌ను పిలిచి పరిస్థిని చూపించి లీకులు సరిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అప్పటి వరకు కాంట్రాక్టరుకు ఇవ్వాల్సిన మిగిలిన డబ్బులు నిలిపివేస్తామన్నారు.

పెయింటింగ్ విజేతలకు బహుమతి ప్రదానం

కాకినాడ క్రైం: గ్లకోమా అవగాహనా వారోత్సవాల్లో భాగంగా యూజీ వైద్య విద్యార్థులకు నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో విజేతలకు కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం , జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి బహుమతులను అందజేశారు. ఆప్తమాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ రమాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు రామచంద్రపురం కంటి విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సుభాష్ హాజరయ్యారు. కంటి చూపు వైద్య విధానాలపై అవగాహన కల్పించారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి తదితరులు పాల్గొన్నారు.